క్లుప్తంగా

వరి విత్తనాల పంపిణీకి బయోమెట్రిక్



వి.కృష్ణాపురం ఆర్బీకేలో రైతులతో బయోమెట్రిక్ వేయిస్తున్న ఏఈఓ లీలాకృష్ణ

దత్తిరాజేరు: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాయితీపై వరి విత్తనాల పంపిణీకి సంబంధించి రైతుల బయో మెట్రిక్ సేకరిస్తున్నామని ఏఈఓ లీలాకృష్ణ తెలిపారు. మండలంలోని వి.కృష్ణాపురం, కోమటిపల్లి గ్రామాల్లో రైతులకు ఏ రకం విత్తనాలు కావాలో తెలుసుకుని, వారి భూముల వివరాలు, ఆధార్ నంబర్ ఆధారంగా బయోమెట్రిక్ నమోదు చేశారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో(ఆర్బీకే)నూ రైతులకు విత్తనాలు పంపిణీ చేయనున్నామని చెప్పారు.

ఉపాధి పనుల పరిశీలన



వేతనదారుల మస్తర్లను పరిశీలిస్తున్న ఏపీఓ అప్పలనాయుడు

మెరకముడిదాం: భైరిపురం గ్రామంలోని జగ్గమ్మచెరువులో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ ఎస్.పెదఅప్పలనాయుడు మంగళవారం పరిశీలించారు. వేతనదారుల మస్తర్ల సీట్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తేనే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ఠ వేతనం అందుతుందన్నారు. జగ్గమ్మచెరువులో రూ.9 లక్షలతో పనులను చేయిస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట క్షేత్రసహాయకుడు శ్రీనివాసరావు ఉన్నారు.

భైరిపురంలో నేత్ర వైద్యశిబిరం

మెరకముడిదాం: మండలంలోని భైరిపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పప్పల గ్రహణేశ్వరరావు ఆధ్వ ర్యంలో విశాఖపట్నం శంకర్‌ఫౌండేషన్ సౌజన్యంతో మంగళవారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. 90 మందికి సిబ్బంది కంటి పరీక్షలు చేసి, 25 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయనున్నట్టు శంకర్‌ఫౌండేషన్ సిబ్బంది తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కందుల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

విచారణ



విచారణ చేపడుతున్న ఏఓ శ్యామ్‌కుమార్, సీఎస్‌డీటీ జయలక్ష్మి

గంట్యాడ: 2021–22 ఖరీఫ్ సీజన్‌లకు సంబంధించి ధాన్యం రవాణా, కలాసీ చార్జీలను సంబంధిత ఏజెన్సీ ఇవ్వకపోవడంపై 'జగనన్నకు చెబుదాం' టోల్‌ఫ్రీ నంబర్‌కు బుడతానపల్లి గ్రామ రైతులు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఏఓ శ్యామ్‌కుమర్, సీఎస్‌డీటీ లగుడు జయలక్ష్మి బుడతానపల్లి గ్రామంలో రైతులను మంగళవారం విచారణ చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని అధికారులు తెలిపారు.

విద్యార్థులకు గ్లాసుల పంపిణీ



విద్యార్థులకు గ్లాసులు పంపిణీ చేస్తున్న పీఎంసీ చైర్మన్, తదితరులు

శృంగవరపుకోట: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా రాగి జావ(మాల్ట్) తాగేందుకు ధర్మవరం ఉన్నత పాఠశాలలో 539 మంది విద్యార్థులకు స్టీలు గ్లాసులను పాఠశాల పేరెంట్స్ కమిటీ(పీఎంసీ) చైర్మన్ చైర్మన్ తగరంపూడి రమణ, హెచ్‌ఎం ఎస్.వెంకటరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రాగిజావ తాగేందుకు విద్యార్థులు ఇంటి వద్ద నుంచి గ్లాసులు తెచ్చుకునే వారని, ఇప్పుడు ప్రభుత్వమే అందరికీ గ్లాసులు సరఫరా చేసిందని చెప్పారు.

ఆటపాటలతో కూడిన విద్య



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి

మెరకముడిదాం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య అందిస్తున్నట్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. మండలంలోని భీమవరం అంగన్‌వాడీ కేంద్రంలో జన బాగీదారీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా పిల్లల తల్లిదండ్రులు, వారి కుటుంబ సభ్యులకు ఫోర్ డెవలప్‌మెంట్ కార్నర్స్ అంశంపై అవగాహన కల్పించారు.

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు'

- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



గుర్ల: 'గడప గడప ప్రభుత్వం' కార్యక్రమంలో అధికారులతో చర్చిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

గుర్ల: ప్రజాసమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తు న్నట్లు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పెనుబర్తి గ్రామంలో నాలుగో రోజు మంగళవారం నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. గ్రామంలో నాలుగు రోజుల పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు ఇంటింటి కీ వెళ్లి తెలుసుకున్న ప్రజా సమస్యలపై ఆయన ఆరా తీశారు. అధికారులతో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని అన్నారు. ప్రతీ సచివాలయానికి ప్రభుత్వం విడుదల చేస్తున్న రూ.20 లక్షలను గ్రామాల్లో అత్యవసరంగా పరిష్కరించాల్సిన సమస్యలకు వెచ్చించాలని సూచించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని చెప్పారు. జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, ఎంపీడీఓ కల్యాణి, ఇతర శాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, సర్పంచ్ తుమ్మగుంటి మాధవి, నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతిరావు, అంబల్ల చిన్నారావు, పరమేష్, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమం

చీపురుపల్లి: రాష్ట్రంలో ప్రతీ గడపకూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చీపురుపల్లి సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో మంగళవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లలో ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి తిరుమల, గిరిడ రాందాసు, కోరుకొండ దాలయ్య, ముల్లు పైడిరాజు, సింహాచలం, ఇప్పిలి కృష్ణ, ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, వెలుగు ఏపీఎం ఎం.వి.రాజశేఖర్, ఈటీపీఆర్డీ అన్నపూర్ణాదేవి తదితరులు పాల్గొన్నారు.



చీపురుపల్లి: అంబేడ్కర్‌కాలనీలో మహిళకు పథకాలను వివరిస్తున్న సర్పంచ్ సుధారాణి, నాయకులు

రూ.6 లక్షలతో కోనేరు అభివృద్ధి



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ సరయు

జామి: మండలంలోని ఆర్.బి.పురంలో మంచినీటి కోనేరును ఉపాధి హామీ నిధులు రూ.6 లక్షలతో అభివృద్ధి చేయనున్నట్లు జెడ్పీటీసీ గొర్లె సరయు, ఎంపీపీ సబ్బవరపు అరుణ తెలిపారు. అభివృద్ధి పనులకు మంగళవారం వారు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ ఏపీఓ శేఖర్‌తో మాట్లాడుతూ అమృత్ సరోవర్ పథకంలో భాగంగా ఉపాధి నిధులతో కోనేరును అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. రూ.4 లక్షలు వేతనాలు, రూ.2 లక్షలు మెటీరియల్ కాంపొండ్ కింద ఖర్చు చేస్తామని చెప్పారు. కోనేరు గట్టు పటిష్టం చేయడం, రన్నింగ్ ట్రాక్, బెంచీలు ఏర్పాటు, సుందరీకరణ పనులు చేపడతామని వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, స్థానిక సర్పంచ్ వర్రి కృష్ణ, ఎంపీటీసీ ముగడ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి



పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశమైన ఎంపీడీఓ కిశోర్ కుమార్

గజపతినగరం: గ్రామాల్లో ప్రజాసమస్యల పరిష్కారానికి సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీఓ కిశోర్‌కుమార్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతీ సోమవారం నిర్వహించే 'స్పందన'లో ప్రజల నుంచి అందే వినతులకు సకాలంలో పరిష్కారం చూపాలని అన్నారు. 'స్పందన'లో వచ్చే ప్రతీ వినతి ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు అవుతున్నదీ లేనిది చూడాల్సిన అవసరం ఉందని అన్నారు.

సమస్యలకు సకాలంలో పరిష్కారం

వేపాడ: ప్రజాసమస్యలకు సకాలంలో పరిష్కారం చూపాలని ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కె.పట్నాయక్ సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలోని వావిలపాడు గ్రామ సచివాలయంలో మంగళవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది బయోమెట్రిక్ హాజరు, మూమెంట్ రిజిస్టర్, ఇతర రికార్డులను పరిశీలించి, ఈ–సర్వీసులపై సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చేపడుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. త్వరితగతిన పనుల పూర్తి చేయించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు సూచించారు. వైఎస్సార్ బీమా రెన్యూవల్‌పై వలంటీర్లను ఆరా తీసి, పలు సూచనలు చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి కన్నంనాయుడు ఉన్నారు.



సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కె.పట్నాయక్

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

శృంగవరపుకోట: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వం స్కిల్‌హబ్‌లు ఏర్పాటు చేసి వివిధ అంశాల్లో ఇస్తున్న ఉచిత శిక్షణను యువత సద్వినియోగించుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. కేశవరావు సూచించారు. స్థానిక కళాశాలలో నిర్వహించిన శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసింది. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ ఎస్.గోవిందరావు, ఏపీఎస్ఎస్‌డీసీ సమన్వయకర్త జి.ఈరన్న,డీఎస్‌డీఈ షణ్ముఖరెడ్డి, కళాశాల ఉపన్యాసకులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం



రైతులకు నవధాన్యాల విత్తనాలను అందజేస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు, తదితరులు

గుర్ల: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ఏఓ తిరుపతిరావు అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాల యంలో ఏఓ ఆధ్వర్యంలో రైతులకు జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్నూరు సన్యాసినాయుడు నవధాన్యాల విత్తనాల కిట్లు, కంది విత్తనాలను రాయితీపై మంగళవారం అందజేశారు. ఏఓ మాట్లాడు తూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండలానికి 1,255 క్వింటాళ్ల వరి విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముద్దాడ కేశవరావు, జిల్లా వ్యవసాయ సలహామండలి డైరెక్టర్ కెంగువ మధుసూదన రావు, నాయకులు తోట తిరుపతిరావు పాల్గొన్నారు.

అరుదైన శస్త్రచికిత్స

విజయనగరం ఫోర్ట్: ప్రమాదానికి గురైన 25 ఏళ్ల యువకుడికి సాయి ఆస్పత్రి వైద్యులు శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. దీనికి సంబంధించి ఆస్పత్రి ఎండీ డాక్టర్ అక్కెన శ్రీరామూర్తి విలేకరులకు మంగళవారం వివరాలు వెల్లడించారు. డెంకాడ మండలం బి.తాళ్లవలసకు చెందిన సూరినాయుడు ఇటీవల ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చేరాడు. క్షతగాత్రునికి మల్టిపుల్ ఆర్గాన్స్, మల్టిపుల్ ఫ్రాక్చర్‌తో పాటు లివర్, గాల్ బ్లాడర్ శస్త్రచికిత్సలు నిర్వహించి ప్రాణం కాపాడామని తెలిపారు. విజయనగరంలో తొలిసారిగా ఇంతటి హైరిస్క్ కేసును ఆస్పత్రి కన్సల్టెంట్ వైద్యులు డాక్టర్ వి.సింధూరి విజయవంతంగా చికిత్స అందించారని చెప్పారు. సాయి ట్రస్టు ద్వారా అతి తక్కువ ఖర్చుతో పూర్తి చికిత్స అందించామని తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

దత్తిరాజేరు: మండలంలోని వి.కృష్ణాపురం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ యాగాటి లక్ష్మిపై అందిన ఫిర్యాదుపై ఆ పథకం ఏపీడీ జనార్దన్ మంగళవారం విచారణ నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై 'జగనన్నకు చెబుదాం' టోల్‌ఫ్రీ నంబర్‌కు గ్రామానికి చెందిన రాయి గౌరి గత నెలలో ఫిర్యాదు చేశారు. విజయవాడ, విశాఖపట్నంలో నివాసం ఉంటున్న గ్రామానికి చెందిన కొంత మందికి పనికి రాకుండానే మస్తర్లు వేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొ న్నారు. ఈ మేరకు ఫిర్యాదుదారు, వేతనదారుల సమక్షంలో గ్రామసచివాలయంలో ఏపీఓ అప్పలనాయుడుతో కలిసి ఏపీడీ విచారణ చేశారు. ఆయా గ్రూపుల్లో ఉన్న వేతనదారుల వాంగ్మూలా న్ని రాత పూర్వకంగా నమోదు చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించి, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఏపీడీ చెప్పారు.



విచారణ చేస్తున్న ఏపీడీ జనార్దన్

గురుదేవ ట్రస్ట్‌కు సాయం అందిస్తాం

- టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి



దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అమరుస్తున్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, విశాఖ ఎంపీ సత్యనారాయణ, ఎమ్మెల్యే శ్రీనివాసరావు

శృంగవరపుకోట: దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న గురుదేవ చారిటబుల్ ట్రస్టు సేవలు అద్భుతమని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. కొత్తవలస మండలం మంగళపాలెం గ్రామంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్టు లో కొత్తగా ఏర్పాటు చేసిన రూరల్ హెల్త్ సెంటర్ ఫర్ ప్రివెంటివ్ డిసీజెస్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఆయన వెంట కార్యక్రమానికి హాజరైన విశాఖపట్నం ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ రూ.2.5లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఎస్.ఆర్.ఐ మెడికల్‌కాలేజితో ఒప్పందం కుదుర్చుకుని రూరల్ హెల్త్ సెంటర్ ఫర్ ప్రివెంటివ్ డిసీజెస్‌ను ప్రారంభించినట్టు ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు చెప్పారు. కృత్రిమ అవయవాల తయారీ విభాగాన్ని పరిశీలించిన టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం బర్డ్ పేరుతో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. గురుదేవ ట్రస్టు చేస్తున్న సేవా కార్యక్రమాలకు అవసరమైన మేరకు సహాయ సహాయకారాలు అందివ్వడానికి శాశ్వతంగా ఎంఓయూ కుదుర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నామంటూ ప్రకటించారు. అనంతరం భజన సంఘాలకు భజన సామగ్రి, 50 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందజేశారు. ట్రస్టు సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని ఎంపీ సత్యనారాయణ, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, డీసీసీబీ చైర్మన్ చిన రామునాయుడు, ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ, ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు, గన్ని వెంకటేశ్వరరావు, గొర్లె సరయు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' సేవలను వినియోగించుకోండి



దత్తిరాజేరు: శిబిరంలో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న మండల ప్రత్యేక అధికారి జనార్దన్



గజపతినగరం: శిబిరంలో సేవలందిస్తున్న వైద్యసిబ్బంది

దత్తిరాజేరు: ఇంటి వద్దనే మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని,ఈసేవలను ప్రజలు సద్వినియోగించుకోవాలని మండల ప్రత్యేక అధికారి జనార్దన్ సూచించారు. మండలంలోని వి.కృష్ణాపురం గ్రామంలో వైద్యాధికారి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సచివాలయంలో ఏర్పాటు చేసిన శిబిరంలో 60 మందికి సిబ్బంది వైద్యపరీక్షలు చేశారు. అనంతరం గృహసందర్శన చేసి ప్రజలకు వైద్య తనిఖీలు చేశారు. వైద్యశిబిరాన్ని ప్రత్యేక అధికారి సందర్శించి వైద్యసేవలపై సిబ్బందిని ఆరా తీయడంతో పాటు తాను కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వైద్యరంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజారోగ్యమే ధ్యేయంగా ఇంటింటికీ వైద్యులను పంపించి వైద్య సేవలు, మందులు ఉచితంగా అందిస్తోందని చెప్పారు.

పురిటిపెంటలో..

గజపతినగరం: పురిటిపెంట గ్రామ సచివాలయం –2 పరిధిలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 97మందికి వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గృహసందర్శన చేశారు. ఎంఎల్‌హెచ్‌సీ సంధ్య, ఏఎన్ఎం సత్యవతి, ఆశ వర్కర్లు రాజేశ్వరి, రమణమ్మ, భారతి పాల్గొన్నారు.

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో సత్తా



జి.తిలోత్తమ, ఎంపీసీ, మార్కులు: 465



జి.మణికంఠ, బైపీసీ, మార్కులు: 435



కె.మౌనిక, ఎంపీసీ, మార్కులు: 460



జె.దివ్య, ఎంపీసీ, మార్కులు: 459

శృంగవరపుకోట: పట్టణంలోని పుణ్యగిరి కళాశాల విద్యార్థులు మంగళవారం విడుదలైన ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ ఫలితాల్లో సత్తా చాటారు. బెటర్‌మెంట్‌కి హాజరైన ప్రథమ సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని జి.తిలోత్తమ (ఆంగ్లమాధ్యమం) 465, బైపీసీ విద్యార్థి జి.మణికంఠ 435 మార్కులు సాధించి జిల్లాలో టాపర్లుగా నిలిచారని ప్రిన్సిపాల్ బండారు మధుసూద నరావు తెలిపారు. విద్యార్థులను పుణ్యగిరి విద్యాసంస్థల అధినేత లగుడు సత్యనారాయణ అభినందించారు. అలాగే చైతన్య జూనియర్ కళాశాలకు చెందిన ఎంపీసీ విద్యార్థిని కె.మౌనిక 460, జె.దివ్య 459 మార్కులు, బైపీసీ విద్యార్థిని బి.చంద్రిక 428, డి.హైమావతి417 మార్కులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.సూర్యారావు చెప్పారు. చైతన్య కళాశాల కరస్పాండెంట్ రెడ్డి వెంకన్న విద్యార్థులను అభినందించారు.

జగనన్న విద్యాకానుక పంపిణీ



చీపురుపల్లి: బాలుర ఉన్నత పాఠశాలలో విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సుధారాణి, వంశీకృష్ణ



శృంగవరపుకోట: విద్యార్థినులకు విద్యాకానుక అందజేస్తున్న ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు

చీపురుపల్లి: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలతో పాటు వంగపల్లిపేట ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తనయుడు వంశీకృష్ణ మంగళవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగించుకుని చక్కగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు జగనన్న విద్యాకానుక కిట్లను ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి మంగళవారం పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగం అభివృద్ధికి కృషిచేస్తున్నారని చెప్పారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తయారు చేశారన్నారు.

చెరువుల అభివృద్ధి, పరిరక్షణకు ప్రాధాన్యం



పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతున్న డీపీఓ శ్రీధర్ రాజు

శృంగవరపుకోట: చెరువుల అభివృద్ధి, పరిరక్షణకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని డీపీఓ శ్రీధర్ రాజు పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎస్.కోట పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. పంచాయతీ అధికారులు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, సర్పంచ్ సంతోషి కుమారి, ఉపసర్పంచ్ మోపాడ కుమార్ సహా పలువురు వార్డు సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతా కలిసి పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలను చేయాలని చెప్పారు. స్థానిక కుళ్ల కోనేరును బాగు చేయాలని డీపీఓ చెప్పగా..పంచాయతీ ఈఓ బి.వి.జె.పాత్రో స్పందిస్తూ సదరు కోనేరు ప్రక్షాళన సాధ్యం కాదని నిర్మొహమాటంగా చెప్పారు. సీతంపేట గ్రామంలో చెరువును బాగు చేయాలని చెప్పారు. ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ ఎస్.కోటలో చెరువులు, ప్రభుత్వ భూములు ఆక్రమణలు నానాటికీ పెరిగిపోతున్నాయని, ఆక్రమణలను తొలగించాలని కోరారు. పంచాయతీ దుకాణాలకు దశాబ్దాలుగా నామమాత్రపు అద్దెలు కడుతున్నారని, పంచాయతీకి ఆదాయం లేక అవస్థలు పడుతున్నా అద్దెలు ఎందుకు పెంచడం లేదని నిలదీశారు. అనంతరం వన్‌వే జంక్షన్ వద్ద కన్నెంగెడ్డలో చేస్తున్న పూడికతీత పనులను ఎమ్మెల్సీ రఘురాజు, సర్పంచ్ సంతోషికుమారి, ఉపసర్పంచ్ మోపాడ కుమార్, పంచాయతీ ఈఓ పరిశీలించారు.

రైతులు, ప్రజాప్రతినిధులు సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్

జామి: ఇనాం భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, రైతులు సహకరించాలని తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్‌కోరారు. ఇనాం భూములకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జామి, రామయ్యపాలెం,జె.డి.వలస,లక్ష్మీపురం, వి.ఆర్.పాలెం,జన్నివలస, శాశనపల్లి, భీమసింగి గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇనాం భూములకు సంబంధించి హక్కులు కల్పించే ప్రక్రియపై రైతులకు ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాలన్నారు. గత నెల 25 న ఇనాం భూములకు సంబంధించి అన్ని వివరాలతో కూడి జాబితా నోటిఫికేషన్ జారీ చేశామని చెప్పారు. జాబితాపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా తెలియజేయాలన్నారు. రైతులు ఎవరికి వారే అభ్యంతర దరకాస్తులు ఇవ్వాలని, గ్రూపుగా ఒకే సారి ఇవ్వకూడదన్నారు. తహసీల్దార్ కార్యలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని చెప్పారు. డీటీ సునీత,జామి మేజర్ పంచాయతీ సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, జామి ఉప సర్పంచ్ అల్లు పద్మ తదితరులు పాల్గొన్నారు.

